పట్టుదలతో చదివితేనే ఉన్నత ర్యాంకులు

• డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్‌రావు

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మనోహర్‌రావు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 14: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత ర్యాంకులు సాధించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్‌రావు అన్నారు. పట్టణ పరిధిలోని కేంద్రియ విద్యాలయ 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జీవితంలో ఉన్నతంగా ఎదుగాలంటే విద్యార్థి దశ కీలకమని సూచించారు. విద్యార్థులు చేసిన స్వాగత నృత్యం, దేశ భక్తిగీతం ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఎన్.చంద్రమౌళి, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : సోమరాజులు

మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు సోమరాజు

ఆలేరు టౌన్, డిసెంబర్ 14 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఉపాధ్యాయ నాయకుడు మందా సోమరాజులు అన్నారు. జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ సౌజన్యంతో ఆలేరు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యాదగిరిగుట్ట, ఆలేరు మండలాల నుంచి సుమారు 150మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు 15వ తేదిన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు జిల్లా ప్రధానకార్యదర్శి పరిగిల రాములు, పీఈటీలు పూల నాగయ్య, విజయ్, భూమేశ్, పూల చంద్రకుమార్, శివకుమార్, ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

హైచ్ఐవీ అవగాహన కర పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

ఆలేరురూరల్, డిసెంబర్ 14 : మండలంలోని కొలనుపాకలో వైఆర్‌జీ లింక్ వర్కర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ హాజరై మాట్లాడుతూ హెచ్ఐవీ నిర్మూలనకు పాడుపడాలన్నారు. అనంతరం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. వైద్యాధికారి అనూష, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు కృష్ణవేణి విద్యార్థులు

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులతో డీఈఓ, ఉపాధ్యాయులు

రామన్నపేట, డిసెంబర్14 : జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు సాధించి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు శరణ్, శ్రీకారుణ్య మ్యాథమెటిక్ మోడలింగ్‌లో, ఫుడ్ అండ్ హెల్త్ జూనియర్ విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. తొమ్మిదో తరగతికి విద్యార్థి ప్రణతి నేచరల్ ఫామింగ్ సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి, రంషా సదాఫ్ మిల్లెట్ ఫర్ సప్లయ్ ఫీచర్ విభాగంలో తృతీయ బహుమతి పొందారు. వీరికి డీఈఓ సత్యనారాయణ, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందించారు. గైడ్ టీచర్లు మురళీ, రషీద్, లావణ్య, మహాలక్ష్మి, నరేశ్, ప్రవీణ్‌ను ప్రిన్స్‌పాల్ అభినందించారు.

కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి తరలిన నాయకులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 14 : హైదరాబాద్‌లోని కోకాపేటలో శనివారం ప్రారంభించిన దొడ్డి కొమురయ్య కురుమ సంఘం భవన ప్రారంభోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి సంఘం నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కొరె భిక్షపతి, రాంబాబు, వెంకన్న, రవి, రమేశ్, రాజు, బీరయ్య తదితరులున్నారు.

రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

• జూనియర్ సివిల్ జడ్జి ఎస్ శిరీష

రామన్నపేట : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష

రామన్నపేట, డిసెంబర్ 14 : క్షణికావేశంలో జరిగిన తప్పులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడమే ఇరువర్గాలకు రాజమార్గం అని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో ఆమె హాజరై 320 కేసులను పరిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, డ్రంక్ అండ్ డ్రైవ్, ప్రీ లిటిగేషన్ వివిధ రకాల కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎ మజీద్, న్యాయవాదులు జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతు, లింగయ్య, సత్తయ్య, నకిరేకంటి మొగులయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, బర్ల డేవిడ్, యాదాసు యాదయ్య, రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, కోర్టు సూపరిండెంట్‌లు నారగోని గంగా భవాని, బాలగోని శివరాజ్, సీనియర్ అసిస్టెంట్ మన్నాన్‌ఖాన్ పాల్గొన్నారు.

స్నేహ పూర్వక జీవనం సాగించాలి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 14 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. భువనగిరి కోర్టు అవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు ప్రారంభించారు. ఇందులో 8 సివిల్ కేసులు, 2,128 క్రిమినల్, సైబర్ క్రైమ్స్, 56 ప్రీ లిటికేషన్ కలిపి మొత్తం 5,582 కేసులును పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఏ.జయరాజు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని రాజీ పడి స్నేహ పూర్వక జీవనం సాగించాలని కోరారు.

రెండు క్రిమినల్ కేసుల్లోని బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా రూ.18 లక్షల నష్ట పరిహారం అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి. మాధవీలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. కవిత, అదనపు డీసీపీ సీ.హె చ్.లక్ష్మీనారాయణ, బార్ అసోసియేషన్ భువనగిరి అధ్యక్షుడు బి.హరినాథ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరిట్ ప్రకారం ఉద్యోగం కేటాయించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న బాధిత యువతి స్వాతి

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో కేర్ టేకర్ ఉద్యోగాన్ని మెరిట్ లిస్ట్ ప్రకారం కేటాయించాలని బాధిత యువతి శనివారం కలెక్టర్ హనుమంతు రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ కేటాయింపులో అవకతవకలకు పాల్పడి మెరిట్ లిస్ట్‌లో ఉన్న వారిని కాదని అనర్హులకు ఉద్యోగం కేటాయించిన ఎంఈఓ శ్రీనివాస్, కేజీబీవీ ఎస్ఓ శివరంజనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెరిట్ లిస్ట్ ప్రకారం ఉద్యోగం కేటాయించే న్యాయం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి సమస్యలపై వినతి పత్రం అందిస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, గ్రామస్తులు

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 14 : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామ సమస్యలను పరిష్కరించాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ హుస్నాబాద్ వద్ద కేటాయించిన ప్లాట్లలో ఇల్లు కట్టుకోవడానికి నిర్వాసితులందరికీ సీఎంతో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరారు. ఇండ్ల నష్టపరిహారం త్వరగా చెల్లిస్తే అందరూ ఇండ్లు కట్టుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పునరావాసంలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, పరమేశ్ తదితరులున్నారు.

మోత్కూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

కల్వర్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, డిసెంబర్ 14 : మున్సిపాలిటీ కేంద్రంలో ప్రధాన రోడ్డుపై నిర్మాణం చేస్తున్న కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు, కల్వర్టు పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

అనారోగ్యంతో హోమియోపతి వైద్యుడు మృతి

రమణ (ఫైల్)

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 14 : మండల కేంద్రానికి చెందిన హోమియోపతి వైద్యుడు రచ్చ రమణ (32) హైదరాబాద్‌లోని నాగోల్‌లో సొంతంగా క్లినిక్ ఏర్పాటు చేసుకున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి పట్ల గ్రామ ప్రజలు, మిత్రులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మిత్రుడికి ఆర్థికసాయం అందిస్తున్న నేతాజీ యువజన మండలి సభ్యులు

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని నేతాజీ యువజన మండలి సభ్యుడైన మద్దెల సాయిరాం కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. సాయిరాం చికిత్స కోసం నేతాజీ సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ.45వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంతన్‌రాజు, మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు మణి, కిరణ్, సతీశ్, సుభాష్, బన్ని పాల్గొన్నారు.

చిట్యాల రైల్వే స్టేషన్ వద్ద వ్యక్తి మృతదేహం

• అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చిట్యాల, డిసెంబర్ 14 : చిట్యాల రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో శనివారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం గొంతు కోసి ఉండటం, పక్కన గుళికల మందు సీసా లభించటంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎన్.ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన రామగిరి శ్రీనివాస వరప్రసాద్ (60) జగిత్యాలలో రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ క్వాలిటీ కంట్రోలర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం అప్పులు చేశాడు. కేతేపల్లిలోని తన వ్యవసాయ భూమి కౌలు డబ్బులు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి ఈ నెల 13న ఉదయం బయల్దేరాడు. కానీ ఆ రోజు ఇంటికి రాలేదు. శనివారం ఉదయం చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో వరప్రసాద్ మృతి చెంది ఉన్నట్లు అతడి కుమారుడికి సమాచారం వచ్చింది. వరప్రసాద్ మృతదేహం ఎడమ వైపు పురుగుల మందు సీసా, కుడి వైపున కత్తి పడి ఉన్నాయి. అతడి గొందు కోసి ఉన్నది. ఘటనా స్థలాన్ని నార్కట్‌పల్లి, చండూరు సీఐలు నాగరాజు, వెంకట్ సందర్శించారు. క్లూస్ టీం, డ్యాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరించారు. మృతుడి భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

బీబీనగర్‌లో జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు, జిట్టా కుటుంబ సభ్యులు

'ప్రజల కోసం పోరాడిన మహనీయుడు జిట్టా'

• ఘనంగా జిట్టా బాలకృష్ణారెడ్డి జయంతి

భూదాన్ పోచంపల్లి : జిట్టా ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న అభిమానులు

బీబీనగర్, డిసెంబర్ 14 : ప్రజల కోసమే అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అని ఆయన అభిమానులు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన తండ్రి జిట్టా బాల్‌రెడ్డి, సతీమణి సునీత, కుమారుడు వివేకానందరెడ్డితో కలిసి స్థానిక నాయకులు ఆవిష్కరించి నివాళులర్పించారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి గ్రామంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, మూసీ ప్రక్షాళన చేయాలని ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలకు జిట్టా అభిమానులు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులు ఏపూరి సోమన్న యాట సంధ్య ధూమ్ ధామ్ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కల్లు గీత కార్మిక సంఘం మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ ఎర్కల సుధాకర్ గౌడ్, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, గోలి నరేందర్‌రెడ్డి, కాసుల ఆంజనేయులు గౌడ్, గడ్డం బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్లు శ్రీనివాస్, వాకిటి గణేశ్‌రెడ్డి, బద్ధం వాసుదేవరెడ్డి, గోలి సంతోశ్‌రెడ్డి, అభిమానులు చింతల లక్ష్మినారాయణ, సోమారపు శంకర్, గౌరుకంటి బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్/అర్బన్/భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బాలకృష్ణారెడ్డి ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వం ఏరియా దవాఖానాలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు శీలం క్రాంతిరెడ్డి, రత్నపురం శ్రీను, పాశం శంకర్‌రెడ్డి, సేవర్తి మధు, బరిగె శంకర్ పాల్గొన్నారు. వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద బాలకృష్ణారెడ్డి ఫ్లెక్సీకి మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ, చిలుగూరి సత్తిరెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, కంకల కిష్టయ్య, నానచర్ల రమేశ్ తదితరులు నివాళులర్పించారు. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతాజీ చౌరస్తా వద్ద జిట్టా బాలకృష్ణారెడ్డి ఫ్లెక్సీకి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామిడి యాదిరెడ్డి, కొమ్ము భానుచందర్, రామిడి నరేందర్‌రెడ్డి, కొట్టం కరుణాకర్‌రెడ్డి, చింతల శ్రీశైలం, వంగేటి జంగారెడ్డి, బాలం రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మౌన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని మౌనదీక్ష

• 5వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 14 : సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు మౌన దీక్ష చేపట్టి నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తమకు కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత లేదని, ఏదైనా ఉద్యోగి ప్రమాదవశాత్తు మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మంగ పాండరి, కరుణాకర్, శిరీష, బొల్లేపల్లి స్వామి, మోహనాచారి, పొన్నాల రేణుక, ఆముదాల సునీత, సంధ్యారాణి, చందర్, భవాని, రవీందర్‌రెడ్డి, జహంగీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుచికరమైన డైట్ కోసం ఒక్కరోజు వంట మాస్టర్

• అధికారులు వస్తున్నారని బయట నుంచి పిలిపించి వంటలు
• ఆలేరు గురుకులం ప్రిన్సిపాల్ నిర్వాకం

ఎంజేపీ గురుకులంలో శనవారం వంటలు చేస్తున్న హమీద్

ఆలేరు టౌన్, డిసెంబర్ 14 : కొత్త డైట్ ప్రారంభోత్సవానికి పట్టణ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం పాఠశాల, కళాశాలలో టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ ముఫారఫ్ అలీ, అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డితో కలిసి గురుకులాన్ని శనివారం సందర్శించారు. అయితే అధికారుల సందర్శన ఉండడంతో గురుకులంలో రోజూ వంట చేసే కుమార్ స్థానంలో టిఫిన్ సెంటర్ హమీద్ ప్రత్యక్షమయ్యాడు. పట్టణంలోని మంతపురి రోడ్డులో టిఫిన్ సెంటర్ నిర్వహించే ఎండీ.హమీద్‌ను గురుకులంలో చూసి.. వంటలు రుచికరంగా ఉండడం కోసమే పిలిపించారని విద్యార్థినుల తల్లిదండ్రులు, సందర్శకులు గుస గుసలాడుకున్నారు. ఇదే విషయమై హమీద్‌ను ఆరా తీయగా.. పెద్ద సార్లు వస్తున్నారని వంట చేయడానికి పిలిస్తే వచ్చాను సార్.. అని సమాధానం చెప్పాడు. దీన్ని బట్టి గురుకులంలో ప్రతిరోజు వంటలు రుచికరంగా ఉండడం లేదనే ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రభుత్వం గురుకులాల నిర్వహణ ఎలా చేపడుతున్నదో ఇక్కడే అర్థమైపోతుందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై నమస్తే తెలంగాణ విలేకరి ప్రిన్సిపాల్ సురేఖను వివరణ కోరగా.. లేదండీ రెగ్యులర్‌గా చేసే కుమారే వంటలు చేశాడని చెప్పడం విశేషం.

ఆకలికి తట్టుకోలేక స్పృహ తప్పిన విద్యార్థి

రాజాపేట ప్రభుత్వ దవఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థి ధనుశ్

రాజాపేట, డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం డైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్లన్న హాజరయ్యారు. ఆ కార్యక్రమం కొనసాగుతున్న క్రమంలో మధ్యాహ్న భోజన సమయం దాటిపోవడంతో ఆరో తరగతి చదువుతున్న డిండి గ్రామానికి చెందిన ధనుశ్ ఆకలికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయాడు. తోటి విద్యార్థులు గమనించి తమ భుజాలపై మోస్తూ సుమారు 500 మీటర్ల దూరంలో ఉన్న గురుకుల కళాశాల గేటు వద్ద వరకు తీసుకెళ్లారు. కార్యక్రమానికి వచ్చిన మండల వైద్యాధికారి భరత్ కుమార్ వెంటనే అక్కడికి వెళ్లి తన వాహనంలో విద్యార్థిని దవాఖానకు తరలించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ధ్యేయం

• టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ ముఫారఫ్ అలీ

ఆలేరు టౌన్ : ఎంజేపీ గురుకులంలో మెనూ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ ముఫారఫ్ అలీ

సంస్థాన్ నారాయణపురం : సర్వేల్ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ఆలేరు టౌన్, డిసెంబర్ 14 : విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ ముఫారఫ్ అలీ అన్నారు. పట్టణ పరిధిలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలలో కొత్త మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీసీ గురుకులంలో అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి, ప్రిన్సిపాల్ సురేఖ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో జిల్లా ఉపాధి కల్పన అధికారిణి పి.సాహితి, మైనార్టీ బాలికల గురుకులంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఎల్ఎస్)జె.మధుసూదన్, ప్రభుత్వ బీసీ కళాశాల విద్యార్థుల వసతిగృహంలో డీఏఓ గోపాల్, ఉదయశ్రీ డైట్ మెనూ ప్రారంభించారు.

బొమ్మలరామారాం / సంస్థాన్ నారాయణపురం : బొమ్మలరామారాం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో డైట్ ప్లాన్‌ను హైదరాబాద్ డీసీపీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ ఐపీఎస్ ఆవిష్కరించి వసతి గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రిజినల్ సైనిక్ వేల్ఫేర్ అధికారి శ్రీనీశ్ కుమార్, తాసీల్దార్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో డైట్‌ను కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించి మాట్లాడారు.

భువనగిరి కలెక్టరేట్ /భూదాన్ పోచంపల్లి/చౌటుప్పల్ : భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో గల మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో నూతన డైట్‌ను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీఎస్ఎన్ వి. ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ కన్వీనర్ ప్రిన్సిపాల్ వీరమళ్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలో మహాత్మ జ్యోతిబా పూలే మలక్‌పేట, కార్వాన్ బాలుర గురుకుల పాఠశాలలో హైదరాబాద్ సీఐడీ విభాగం డీఐజీ నారాయణ నాయక్‌తో కలిసి ఎమ్మెల్సీ బల్మూరి వెంకటనర్సింగ్‌రావు మెనూ లాంచింగ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో డైట్ మెనూను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు.

యాదగిరిగుట్ట /ఆలేరు రూరల్ /ఆత్మకూర్(ఎం)/భువనగిరి అర్బన్ /రామన్నపేట/ అడ్డగూడూరు/మోత్కూర్ : యాదగిరిగుట్ట పట్టణంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహంలో నూతన డైట్‌ను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఆలేరు మండలంలోని కొలనుపాక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్ తనిఖీ చేశారు. ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలబాలికల వసతిగృహాలను మండల ప్రత్యేకాధికారి రాజారాం, తాసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాములునాయక్ తనిఖీలు చేశారు. భువనగిరి పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మెనూ బోర్డును మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రామన్నపేట మండల కేంద్రంలోని వసతి గృహాల్లో నూతన మెనూను తాసీల్దార్ లాల్‌బహదూర్ ప్రారంభించారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో డైట్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. మోత్కూరు మండలంలోని బాలికల వసతి గృహంలో తాసీల్దార్ రాంప్రసాద్ డైట్‌ను ప్రారంభించారు.

రియల్టర్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

యాదగిరిగుట్ట, డిసెంబర్14 : పట్టణంలోని యాదగిరిపల్లి శివాలయం ఎదుట యాదాద్రి రియల్టర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఆ సంఘం కార్యవర్గం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ జీపీ లే అవుట్‌లను పునరుద్ధరించి రియల్ ఎస్టేట్ వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కళ్లెం కృష్ణ, ఆరె శంకర్, కోశాధికారి కొడూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి ర్యాకల రాజు, ఉపాధ్యక్షుడు పాపట్ల నరహరి, బీమగాని నరసింహగౌడ్ పాల్గొన్నారు.

నూతన కార్యాలయం వద్ద అసోసియేషన్

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వేములపల్లి, డిసెంబర్ 14: ఈ నెల 12న దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు చెందిన లావూరి శివ మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వలో దూకి గల్లంతయ్యాడు. అతడి మృతదేహం శనివారం లభ్యమైనట్లు వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా పొనుగోడు చెరువులో గుర్తించగా వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.